క్లుప్తంగా

దేశభక్తి స్ఫూర్తితో మొక్కలు నాటాలి



పెద అమిరంలో మొక్కలు నాటుతున్న సర్పంచ్, ఎస్ఆర్‌కేఆర్ విద్యార్థులు

కాళ్ల: దేశభక్తి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగపతి రాజు కోరారు. ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా గురువారం మండలంలోని పెద అమిరం పంచాయతీ, కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో మేరా మట్టి – మేరా భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల పాలకవర్గ సభ్యుడు సాగి సత్య ప్రతీక వర్మ, సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు, ఉప సర్పంచ్ జవ్వాది కిషోర్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.కృష్ణ చైతన్య, విద్యార్థులు కలిసి పంచాయతీ చెరువు చుట్టూ మొక్కలు నాటారు. నా భూమి నా దేశం పేరుతో ఏర్పాటు చేసిన శిలాఫలకం వద్ద ప్రతిజ్ఞ చేశారు.

విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలి

పాలకోడేరు: విద్యార్థులు, మహిళలు జాగ్రతలు పాటించాలని పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం ఆయన గొల్లలకోడేరు హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో మహిళా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. మహిళలు, విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా ఇంటా, బయటా కూడా ఆడ పిల్లలు అనేక అకృత్యాలకు గురవుతున్నారని అన్నారు. మార్కెట్‌కు వెళ్లేటప్పుడు ఒంటరిగా వెళ్లకూడదని, గుంపులుగా వెళ్లాలని సూచించారు. సమాజంలో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులను అవగాహన చేసుకోవాలని కోరారు. ప్రతిరోజూ వార్తలు తెలుసుకోవడం ద్వారా జరుగుతున్న మోసాలను అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రతీ వ్యక్తిని పూర్తిగా నమ్మకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మణిపూర్ బాధితులకు రాజ్ ట్రస్ట్ సహాయం



నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: మణిపూర్ బాధితులకు భీమవరం పట్టణంలోని రాజ్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు ట్రస్ట్ అధ్యక్షుడు గంటా రాజ్‌కుమార్ గురువారం చెప్పారు. మణిపూర్‌లో గిరిజన క్రైస్తవులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు చేయడమే కాక క్రైస్తవ చర్చిలను తగులబెట్టడం దారుణమన్నారు. ఈ ఘటనలో బాధితులకు ట్రస్ట్ తరపున చేయూతనందిచాలనే సంకల్పంతో అక్కడ పర్యటించి నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు బాధితులకు అండగా నిలబడి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని రాజ్‌కుమార్ కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

పాలకోడేరు: రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయని జిల్లా ప్రకృతి వ్యవసాయ శాఖ ప్రాజెక్ట్ మేనేజర్ నూకరాజు, జిల్లా కో ఆర్డినేటర్ అరుణకుమారి పేర్కొన్నారు. గురువారం విస్సాకోడేరు గ్రామంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో 60 మంది రైతులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎం నూకరాజు, ప్రకృతి వ్యవసాయ గురించి రైతులకు అవగాహన కల్పించారు. వరిలో ప్రధానంగా వచ్చే తెగుళ్లు, పురుగులు నివారణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జెడ్‌పీ వీరస్వామి, డివిజన్ ఇంచార్జ్ స్వామి, మండల ఇంచార్జ్ రవికుమార్, శివకృష్ణ, దుర్గారావు, వీరేంద్ర, నాగ వెంకట వరలక్ష్మి, చిన్నారి, నాగలక్ష్మి, సురేష్, లక్ష్మి రైతులు పాల్గొన్నారు.

చోరీ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

ఆకివీడు: దొంగతనాల కేసుల పరిశోధనల్ని వేగవంతం చేయాలని జిల్లా ఎస్పీ యూ.రవి ప్రకాష్ ఆదేశించారు. ఇటీవల స్థానిక వెలంపేటలో చోరీ జరిగిన ఇంటిని ఎస్పీ గురువారం పరిశీలించారు. గత నెల 28వ తేదీన ఇంటి యజమాని జమ్మిశెట్టి దుర్గ తూర్పు గోదావరి జిల్లాలోని దేవాలయాల్ని సందర్శించేందుకు వెళ్లారు. ఆగస్టు1వ తేదీన ఆమె ఇంటి తలుపుల తీసి ఉండటంతో ప్రక్క ఇంటి వాళ్లు పోలీసులకు, దుర్గకు ఫోన్ చేయడంతో ఆమె వచ్చి ఇంట్లో నగదు, బంగారం పోయిన విషయంపై ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. దొంగతనం జరిగిన సంఘటనపై ఆ ప్రాంతాన్ని ఎస్పీ పరిశీలించారు. వేలిముద్రలు ఆధారంగా కేసును త్వరితగతిని వెలికితీయాలని ఎస్ఐ సత్యసాయిని ఆదేశించారు.

నులి పురుగులను నులిమేస్తేనే ఆరోగ్యం



భీమవరం దుర్గాపురంలోని మున్సిపల్ స్కూల్‌లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఉపాధ్యాయులు



ఉండి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో నులి పురుగుల నివారణ మాత్రలు మింగిస్తున్న ఎంపీపీ శ్రీహరినారాయణరాజు



ఆకివీడు: అజ్జమూరు గరువులోని ఎంపీపీ పాఠశాలలో నులి పురుగుల మాత్రలను విద్యార్థులకు వేస్తున్న వైద్య సిబ్బంది

భీమవరం అర్బన్ : పిల్లల్లో ఎక్కువగా నులి పురుగులు ఉంటాయని, వీటి వల్ల రక్తహీనత, నీరసం, కడుపు నొప్పి వంటి సమస్యలతో విద్యార్థులు చదువులో వెనుకబడే ప్రమాదం ఉందని, నులి పురుగులను నులిమేస్తేనే ఆరోగ్యమని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సీహెచ్ ధనలక్ష్మి అన్నారు. భీమవరం మండలం గొల్లవానితిప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఎంపీడీవో కె.వెంకటలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటి వద్ద ఉండే పిల్లలకు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎమ్‌లు మాత్రలు మింగించేలా చర్యలు చేపట్టామన్నారు. అనారోగ్యంగా ఉంటే పిల్లలకు ఈ మాత్రలు వేయకూడదన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వేండ్ర వెంకటేశ్వరరావు, సర్పంచ్ చిల్లే వెంకటేష్,, కార్యదర్శి కె. భవాని, ప్రధానోపాధ్యాయుడు రఘు వరప్రసాద్ పాల్గొన్నారు. అలాగే వెంపలోని హైస్కూల్లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ ఇంజేటి రాజేశ్వరి ప్రారంభించారు. తుందుర్రు పీహెచ్‌సీ ఎంవో క్రిష్టాఫి, ప్రధానోపాధ్యాయుడు సూర్య భగవాన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగులతో ఆరోగ్య సమస్యలు

సాక్షి, భీమవరం: విద్యార్థుల్లో నులిపురుగుల వల్ల కడుపునొప్పి, రక్తహీనత వంటి అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయని కె.కృష్ణారావు అన్నారు. గురువారం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా భీమవరం పట్టణంలోని దుర్గాపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు నిత్యం శుభ్రంగా ఉండడంతో పాటు పరిశుభ్రమైన నీటిని తాగాలని, బయట తిరిగే సమయంలో బూట్లు ధరించాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం షేక్ బాబాజీ సాహెబ్, ఏఎన్ఎం కె.ఉషశ్రీ, ఆశా వర్కర్ సీహెచ్ వరలక్ష్మి, ఉపాధ్యాయిని ఎ.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ తప్పనిసరి

ఉండి: మనిషి కడుపులో ఉండే నులిపురుగులను నివారించడం తప్పనిసరిగా చేయాలని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు.గురువారం మండల వ్యాప్తంగా ప్రారంభమైన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ఉండి జడ్పీ హైస్కూల్‌లో ఎంపీపీ ప్రారంభించారు. ఉండి పీహెచ్‌సీ పరిధిలో 4535 మందికి గాను 4432 మందికి సుమారు 98 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసినట్లు డాక్టర్ సాయి చంద్ర తెలిపారు.ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఆర్ కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాత్రలతో రక్తహీనత దూరం

ఆకివీడు: జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవం గురువారం మండలంలోని పలు పాఠశాలల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో నులిపురుగుల మాత్రలను వైద్య సిబ్బంది పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నులి పురుగులను నిర్మూలిద్దాం

భీమవరం (ప్రకాశంచౌక్): ఆరోగ్య సంరక్షణ దిశగా అడుగులు వేద్దాం.. నులి పురుగులను నిర్మూలిద్దామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. నులిపురుగుల నివారణలో భాగంగా భీమవరం పట్టణంలోని చిన రంగనిపాలెం పురపాలక ఉన్నత పాఠశాలలో గురువారం చిన్నారులకు ఆమె స్వయంగా ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల్లో అనారోగ్యానికి కారణమయ్యే నులిపురుగుల నివారణలో భాగంగా ఒకటి నుంచి 19 ఏళ్ల లోపు వయస్సు ఉన్న పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ మాత్రలను ప్రతి ఒక్కరూ తప్పక వేసుకోవాలన్నారు. నా భూమి–నా దేశం, నేల తల్లికి వందనం, వీరులకు వందనం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ముందుగా రంగనిపాలెం పురపాలక సంఘం ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు కంప్యూటరు డేటాను తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకట రమణ, జిల్లా పంచాయతీశాఖ అధికారి జీవీకే మల్లికార్జునరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు, పురపాలక సంఘం కమిషనర్ ఎం.శ్యామల, వైద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎఎన్ఎంలు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎన్నార్ లా విద్యార్థులకు పట్టాల ప్రదానం



విద్యార్థులకు పట్టాలు అందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: భీమవరం డీఎన్నార్ లా కళాశాలలో గురువారం లా కోర్స్ డిస్టెంక్షన్, ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకట నర్సింహరాజు మాట్లాడుతూ పట్టాలు పొందిన విద్యార్థులు పేదలకు ఉచిత న్యాయ సహాయాన్ని అందించాలన్నారు. సెక్రటరీ, కరస్పాండెంట్ గాది రాజు సత్యనారాయణరాజు(బాబు) మాట్లాడుతూ డీఎన్నార్ న్యాయ కళాశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు కళాశాలకు పేరు ప్రఖ్యాతులు సాధించటానికి తమ నైపుణ్యాలను పెంచుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిని పెంచేలా నా భూమి – నా దేశం

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

భీమవరం (ప్రకాశం చౌక్): ప్రజల్లో దేశభక్తిని పెంచేలా నా భూమి – నా దేశం కార్యక్రమాలను చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం భీమవరం కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె నా భూమి – నా దేశం కార్యక్రమాలను వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు నా భూమి – నా దేశం కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అజాది కా అమృత్ మహోత్సవ్ పేరిట పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సంవత్సరం నా భూమి – నా దేశం పేరున ఆగస్టు 9 నుంచి 20వ తేదీ వరకు కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను అన్ని గ్రామ పంచాయతీలు, మండలాలు, పట్టణ ప్రాంతాల్లో చేపట్టనున్నట్లు వెల్లడించారు. తొలి రోజు ఆగస్టు 9న పంచాయతీ కార్యాలయాలలో ప్రధాన మంత్రి,, ముఖ్యమంత్రి సందేశాలు వినడం , శిలాఫలకాన్ని ఆవిష్కరించి, మొక్కలు నాటడం జరిగిందన్నారు. రెండో రోజు ఆగస్టు 10వ తేదీన పంచ ప్రాణ ప్రతిజ్ఞను అన్ని పాఠశాలలు, కళాశాలలో చేపట్టినట్లు తెలిపారు. ఆగస్టు 11వ తేదీన వసుధకు వందనం పేరిట పాఠశాలలు, కళాశాలలు, పంచాయతీలు, పరిశ్రమలు తదితర ప్రాంతాల్లో కనీసం 75 మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. 14వ తేదీన వీరులకు వందనం పేరిట దేశ సంక్షేమం కోసం ప్రాణ త్యాగాలు చేసిన స్థానిక మహనీయులను, సాహసవంతులు, వీరులను స్మరించుకోవడం, మరణించిన వీరుల కుటుంబాలను, జీవించి ఉన్న వీరులను సత్కరించే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. 15వ తేదీన జాతీయ జెండా ఎగరవేసి వందన సమర్పణ చేయడం జరుగుతుందన్నారు. అలాగే 16 నుండి 20వ తేదీ వరకు మండలాలు, పెద్ద మున్సిపాలిటీలలో నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం పలు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. గ్రామ పంచాయతీలు, మండలాలకు చెందిన యువత, వారి ప్రాంతాల్లోని మట్టిని కలశంలో తీసుకుని ఢిల్లీకి ప్రయాణమై ఈనెల 27, 28 తేదీలలో ఢిల్లీకి చేరుకుని అక్కడ కర్తవ్యపథ్‌లో జరిగే ముగింపు కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. నా మట్టి – నా దేశం కార్యక్రమాల్లో భాగంగా ర్యాలీలు, సమావేశాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. పెద్ద ఎత్తున ప్రజలు, యువత నా మట్టి – నా దేశం కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. అనంతరం కలెక్టరేట్‌లోని వివిధ కార్యాలయాల సిబ్బంది, మీడియా ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ నా మట్టి – నా భూమి ప్రతిజ్ఞ పాల్గొన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడు సుందరీకరణకు భూమిపూజ



ఆకివీడులో దొరగారి చెరువు సుందరీకరణ పనులకు భూమి పూజ చేస్తున్న నర్సింహరాజు

ఆకివీడు: ఆకివీడు నగర పంచాయతీ నడి బొడ్డున ఉన్న దొరగారి చెరువు సుందరీకరణ, ఆధునికీకరణ పనులకు గురువారం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహరాజు భూమి పూజ చేశారు. కార్పొరేషన్ నిధులు రూ. 62 లక్షల వ్యయంతో చెరువు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా పీవీఎల్.నర్సింహరాజు మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వల్ల మంచినీటి చెరువు పాడైపోయిందన్నారు. ఎన్నికల ముందు దొరగారి చెరువు అభివృద్ధికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఇచ్చిన హామీ ప్రకారం అమృత్ 2.0, ఏపీజీబీ కార్పొరేషన్ ద్వారా చెరువు అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు పీవీఎల్ చెప్పారు. చెరువు చుట్టూ గట్టును బలంగా నిర్మించి, గట్టుపై గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేసి, చెరువు చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణం చేపడతామన్నారు. కాంట్రాక్టర్ రవీంద్ర రెడ్డి ఆధ్వర్యంలో చెరువు పనుల్ని వేగంగా చేపట్టి, త్వరితంగా పూర్తిచేసే విధంగా స్థానిక నగర పంచాయతీ సహకరించాలని పీవీఎల్ సూచించారు. చైర్‌పర్సన్ జామి హైమావతి మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీ మేరకు పీవీఎల్.నర్సింహరాజు దొరగారి చెరువు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారన్నారు.ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చెర్మన్‌లు పుప్పాల పండు, వంగా జ్యోత్సన, చీప్ విప్ పడాల శ్రీనివాసరెడ్డి, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి, కౌన్సిలర్లు కట్టా రవి, నిమ్మల నాగు, గేదల అప్పారావు, దొడ్డి జగదీష్, ఎండీ.జక్కీ, ఆలీ, హుస్సేన్, జీ.ధనరాజు, జోగి నాగరాజు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం



కోపల్లె హైస్కూల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కాళ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన పాలనలో విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారని ఎంపీపీ పెనుమత్స విశ్వనాథరాజు, జెడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండలంలోని కోపల్లె హైస్కూల్‌లో విద్యార్థులకు ఆల్బెండజెల్ మాత్రలు పంపిణీ చేశారు. పరిశుభ్రతను పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు అంగన్వాడీ సెంటర్లలోని పిల్లలకు మాత్రలు పంపిణీ ఇప్పటికే పూర్తి చేశామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లంక భవాని, పీహెచ్‌సీ డాక్టర్లు గులాబ్ రాజ్‌కుమార్, సునీల్, ఎంఈవో కనకరాజు, ఉప సర్పంచ్ బూడి పరాలు, ప్రధానోపాధ్యాయుడు సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అవగాహన

వీరవాసరం: వీరవాసరం పీహెచ్‌సీ పరిధిలోని హెల్త్ వెల్నెస్ సెంటర్–2 ఆధ్వర్యంలో స్థానిక చినపేట కమ్యూనిటీ హాల్ వద్ద ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ 104(ఎఫ్‌పీసీ) క్యాంప్‌నకు డాక్టర్ పి.సత్య సౌజన్య హాజరయ్యారు. వ్యాధిగ్రస్తులను పరీక్షించి నెలకు సరిపడా మందులను అందజేశారు. జాతీయ నులిపురుగులు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపీపీ ఎలిమెంటరీ స్కూల్, మెయిన్ స్కూల్ పలు పాఠశాలల విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

భీమవరం అర్బన్: వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించి స్వచ్ఛమైన పర్యావరణాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఫారెస్ట్ ఆఫీసర్ అబ్దుల్ చారి అన్నారు. భీమవరం మండలంలోని గొల్లవానితిప్ప గ్రామంలో గురువారం ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి – నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో అడవులను నరికివేయడం, రసాయనిక పరిశ్రమల వల్ల గాలి, నీరు, నేల కలుషితమై పర్యావరణం దెబ్బతింటుందని, దీనిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణం పరిరక్షణకై నడుం బిగించాల్సిన అవసరం ఉందన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

సాక్షి, భీమవరం: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) 50వ ఆవిర్భావ దినోత్సవాన్ని భీమవరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి యూటీఎఫ్ ఉద్యమ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న చారిత్రక అవసరం కోసం ఏర్పడిన ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌ను రాష్ట్రంలో ఒక పెద్ద సంఘంగా తీర్చిదిద్దడానికి అనేక మంది జీవితాలను త్యాగాలు చేశారన్నారు. జిల్లా అధ్యక్షుడు పీఎస్ విజయరామరాజు, కార్యదర్శులు కేఎస్ రామకృష్ణ ప్రసాద్, జి.రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే నూరు శాతం పూర్తి చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): ఓటర్ల జాబితా ఇంటింటి సర్వే నూరు శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. గురువారం అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా పురోగతిపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌కు స్థానిక కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, డీఆర్వో కె.కృష్ణవేణి, ఆర్డీవో దాసిరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా కోసం చేపట్టిన ఇంటింటి సర్వే పురోగతిపై జిల్లాల వారీగా కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఫారం 6 కొత్త ఓటర్లకు 18 సంవత్సరాల నిండిన వారికి ఇవ్వాలని, ఫారం 8 చిరునామా మార్పులు కోసం ఇవ్వాలన్నారు. ఓటర్లు తొలగింపును ప్రొసీజర్ ప్రకారం జాగ్రత్తగా చేయాలన్నారు. అలాగే పలు అంశాలపై జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఈఆర్‌ఓలు, ఏఈఆర్ ఓలకు దిశానిర్దేశం చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ విధి విధానాల మేరకు జిల్లాలో అన్ని కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తున్నామని రాష్ట్ర ఎన్నికల అధికారికి తెలిపారు. ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2024ను ఎలాంటి పెండింగ్ లేకుండా ఇంటింటి సర్వేని వేగవంతం చేస్తున్నామని వివరించారు. జిల్లాలో 5,60,111 కుటుంబాలు ఉన్నాయని, అందులో 2,60,919 కుటుంబాలను ఇంటింటికిఅ బీఎల్ఓలు వెళ్లి వెరిఫికేషన్ చేసినట్లు తెలిపారు. 56,065 కుటుంబాల సర్వే వివరాలను బీఎల్‌వోలు యాప్‌లో అప్‌లోడ్ చేసినట్లు చెప్పారు. 4,464 కొత్త ఓటర్లను గుర్తించి వారి వద్ద నుంచి ఫారమ్స్‌ను తీసుకోవడం జరిగిందని తెలిపారు. 10 ఓట్లు ఉన్న 6,276 కుటుంబాలను గుర్తించి వెరిఫికేషన్ చేసినట్లు తెలిపారు. 100 సంవత్సరాలుపైబడిన 105 మంది ఓటర్లును గుర్తించి పరిశీలించినట్లు వివరించారు. 6,7,8 ఫారం ద్వారా వచ్చినవి, ఆఫ్‌లైన్ నుండి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినట్లు తెలిపారు. అలాగే జిల్లాలో ఫారం 6, ఫారం -7, ఫారం–8పై పరిష్కారాలపై వివరించారు. ముఖ్యంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 18–19 వయస్సులో ఉన్న వారు, ట్రాన్స్‌జెండర్లు, నిరాశ్రయుల జాబితా తయారీలోనూ ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని కలెక్టర్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఈఆర్వోలుగా నియమితులైన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డీఎల్‌డీవో కేసీహెచ్ అప్పారావు, డ్వామా పీడీ ఎస్.టి.వి రాజేశ్వరరావు, జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి ఎ.దుర్గేష్, జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు, జిల్లా కో పరేటివ్ అధికారి రవికుమార్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వి.ఆదిశేషు, ఎలక్షన్ సెక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన వేగవంతం చేయాలి

ఆకివీడు: ఓటర్ల జాబితా పరిశీలన వేగవంతం చేయాలని ఎంపీడీఓ కందుల వాణీ ఆదేశించారు. వలంటీర్లు ఇంటింటా సర్వేపై గురువారం డీఎల్ఓల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటా సర్వే వేగవంత చేయడం ద్వారా ఓటర్ల తుది జాబితాకు సమాచారం అందుతుందన్నారు. చనిపోయిన ఓటరు వివరాలు, కొత్త ఓట్ల నమోదు ప్రక్రియతో పాటు, ఓటర్ల అడ్రస్సు మార్పులు, అనారోగ్యంతో ఉన్న ఓటర్ల వివరాలు, ఫారం–6, ఫారం–8 తదితర వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్ విజయలక్ష్మి, కమిషనర్ కృష్ణమోహన్, ఏఓ శ్రీకర్ అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులు దారి మళ్లించారంటూ మహా నిరసన

సాక్షి, భీమవరం: కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు కేటాయించిన ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లించారంటూ గురువారం భీమవరంలో బీజేపీ, జనసేన సంయుక్త ఆధ్వర్యంలో మహా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌కు సమీపంలో ఏర్పాటు చేసిన నిరసన శిబిరం వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ బాజీ మాట్లాడుతూ కేంద్రం గ్రామాల అభివృద్ధికి కేటాయించిన నిధులను దారి మళ్లించి అభివృద్ధిని కుంటుబర్చడం దారుణమన్నారు. కార్యక్రమంలో బీజేపీ, జనసేన నాయకులు కొటికలపూడి గోవిందరావు, జుత్తిగ నాగరాజు, పేరిచర్ల సుభాష్, ఈతకోట తాతాజీ, వెంకటరెడ్డి, కోమటి రవికుమార్, తోట గంగరాజు, కుర్రెళ్ల నర్సింహరావు, లక్ష్మీపార్వతి, కాయిత సురేంద్ర, అల్లూరి సాయి దుర్గరాజు, షేక్ మొహిద్దిన్, ఆకుల లీలాకృష్ణ, ఇంజేటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

16న మండల పరిషత్ సమావేశం

పాలకోడేరు: ఈ నెల 16 వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు పాలకోడేరు మండల పరిషత్ కార్యాలయంలో సర్వ సభ్య సమావేశం జరుగుతుందని మండల పరిషత్ అధ్యక్షుడు భూపతిరాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు) తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

నాలుగు నామినేషన్ల దాఖలు

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి, అజ్జమూరు గ్రామాల పరిధిలోని మూడు వార్డు సభ్యులకు గురువారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. కుప్పనపూడి పంచాయతీ పరిధిలో కట్రెడ్డి సుబ్బారావు, నాగమణి, మద్ది శెట్టి లక్ష్మి, ధనలక్ష్మిలు నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి కె.వాణీ గురువారం తెలిపారు. అజ్జమూరు గ్రామంలోని ఒక వార్డుకు బుధవారం ఒక నామినేషన్ దాఖలు కాగా గురువారం నామినేషన్ దాఖలు కాలేదు.

కలిసిపూడిలో మొత్తం 3 నామినేషన్లు

ఉండి: మండలంలోని కలిసిపూడి గ్రామ పంచాయతీ 3వ వార్డుకు జరుగుతున్న ఉప ఎన్నికకు గురువారం ఒకరు నామినేషన్ వేసినట్లు ఎంపీడీవో ఏవీ అప్పారావు తెలిపారు. దీంతో మొత్తం మూడు నామినేషన్‌లు వేసారని తెలిపారు.11వ తేదీ శుక్రవారం నామినేషన్‌లకు చివరి రోజని ఆయన తెలిపారు.

గొల్లలకోడేరు 6 వార్డుకు 5 నామినేషన్లు

పాలకోడేరు: గొల్లలకోడేరు గ్రామ పంచాయతీ 6వ వార్డుకు జరిగే ఎన్నికలకు సంబంధించి గురువారం 5 నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల వేసిన వారిలో సంబల దీవి నాగమణి, సంబల దీవి అనిత, పేరుపాలెం వెంకటలక్ష్మి, సంబలదీవి దేవి, సంబలదీవి నాగమ్మలు నామినేషన్లు దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు.

హెల్మెట్ వాడకంపై వాహనదారులకు అవగాహన

భీమవరం అర్బన్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని రూరల్ ఎస్సై బి.మోహన్‌రావు అన్నారు. భీమవరం మండలంలోని గొల్లవానితిప్పలో గురువారం హెల్మెట్ వాడకం వల్ల కలిగే ఉపయోగాలపై ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పించారు. ఎస్సై మోహన్‌రావు మాట్లాడుతూ కొంతమంది యువత అతివేగంగా ద్విచక్ర వాహనాలను నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలను పోగొట్టుకుంటున్నారన్నారు. రోడ్డుపై అతివేగంగా ప్రయాణించకూడదని, మనల్ని నమ్ముకుని ఒక కుటుంబం ఉన్నదని ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన ఘటనపై కేసు నమోదు

కాళ్ల: కులం పేరుతో దూషించి కొట్టి గాయపరిచారు అంటూ ఇచ్చిన ఫిర్యాదు పై కాళ్ల పోలీస్ స్టేషన్లో గురువారం కేసు నమోదైంది. కాళ్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కరం గ్రామంలోని పెదపేటకు చెందిన ఉచ్చుల నతానీయేలు ఉండి మండలం చినపుల్లేరు గ్రామంలోని అట్టల ఫ్యాక్టరీలో లారీ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. పెదపేటకు ఆనుకుని నివాసం ఉంటున్న కారుమూరి సత్యనారాయణ పాత గొడవలను ఉద్దేశించి ఈనెల 8వ తేదీ ఉదయం గొడవ పడుతూ కులం పేరుతో దూషించి కొట్టి గాయపరిచాడని పోలీసులు తెలిపారు. దీనిపై నతానీయేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ జె.శ్రీనివాసరావు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.